## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభాకర్

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 10 : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ ప్రభాకర్ సూచించారు. మంగళవారం గర్భిణులకు ప్రత్యేకంగా క్యాంప్ ఏర్పాటు చేసి వారికి వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భం దాల్చిన నుంచి ప్రతి రోజు ఆకు కూరలు, గుడ్లు తీసుకొని ఆరోగ్యంగా ఉన్నప్పుడే పుట్టబోయే బిడ్డ బలంగా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ దవాఖానాలో వందశాతం నాణ్యమైన వైద్య మందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ ప్రసవాలు చేసి తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉండే విధంగా చూస్తున్నట్లు తెలిపారు.

## ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



చెక్‌పోస్టు వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 10 : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని చెక్ చేయాలని శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామం వద్ద హైదరాబాద్– బెంగుళూరు జాతీయ రాహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. సరైన పత్రాలు చూపిస్తే తప్ప ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. సందర్శించిన వారిలో అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ రాంచందర్‌రావు, శంషాబాద్ సీఐ శ్రీధర్ కుమార్ తదితరులు ఉన్నారు.

## డబ్బు, మద్యం రవాణాను నియంత్రిద్దాం

మియాపూర్, అక్టోబర్ 10 : రాష్ట్రంలోనే అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అధిక మొత్తంలో రాజకీయ పక్షాలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉన్నందున నియంత్రణకు అధికారులు అత్యంత పటిష్ఠంగా వ్యవహరించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో), జడ్సీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అత్యంత ప్రధానంగా డబ్బు మద్యం ప్రవాహాన్ని పూర్తిగా అరికట్టేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి అమలుపై పోలీసు అధికారులు స్టాటిక్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ పర్యవేక్షక అధికారులు, ఏఆర్‌వోలతో ఆర్‌వో శ్రీనివాసరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 5 ఫ్లయింగ్ స్టాటిస్టికల్ బృందాలు, మరో 6 స్టాటిక్ బృందాలను నియమించినట్లు, ఈ బృందాలు ఎప్పటికప్పుడు వాహన తనిఖీలను చేపడుతూ అనధికారికంగా చెలామణి చేసే నగదు, ఓటర్లకు పంచేందుకు మద్యం, ఇతర బహుమతులను స్వాధీనం చేసుకుంటారన్నారు. నియోజకవర్గ హద్దుల వద్ద ప్రత్యేకంగా పోలీసు తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్‌వో తెలిపారు. తనిఖీల ప్రక్రియ ఆసాంతం వీడియో చిత్రీకరణను చేపట్టాలన్నారు. ప్రధానంగా రాత్రి, తెల్లవారుజామున డబ్బు, మద్యం సరఫరా చేసే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని, తగు పత్రాలులేని నగదు, మద్యాంను తక్షణమే సీజ్ చేయాలని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రకటనతో ఎంసీసీ అమలులో ఉన్నందున రాజకీయ పక్షాల బ్యానర్లు, ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు తక్షణమే తొలగించాలని, వాటిపై రంగులు వేయాలన్నారు. రాజకీయ పార్టీల నేతల కాంస్య విగ్రహాలను సైతం కప్పి ఉంచాలని ఆర్‌వో శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు ఎటువంటి పొరపాట్లు, అవకతవకలకు పాల్పడొద్దని, విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## టీబీ రోగులకు పౌష్టికాహార కిట్స్ పంపిణీ



రోగులకు కిట్స్ పంపిణీ చేస్తున్న త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 10 : టీబీ రోగులకు త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. మంగళవారం శంషాబాద్ ప్రభుత్వ దవాఖానాలో కిట్స్‌ను పంపిణీ చేశామన్నారు. త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరి మాట్లాడుతూ టీబీ రోగులు లేని భారత దేశం కావాలనే లక్ష్యంతో ప్రతి నెల టీబీ రోగులకు పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల వారికి అవసరమైన వాటిని అందిస్తు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కవిత, పద్మ, అరుణ, రజిత,అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

బండ్లగూడ, అక్టోబర్ 10 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, బస్తీలలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీలను ఆయన ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. కావున కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి రాజకీయాలకు సంబంధించిన ఫ్లెక్సీలు కానీ మరి ఇతర బోర్డులు కానీ, రాతలు లాంటివి కనిపించవద్దని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత




ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువతతో శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు

బండ్లగూడ, అక్టోబర్ 10 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో అపెక్స్ ఇండియా సంస్థ సహకారంతో నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై కొంతకాలంగా శిక్షణను అందిస్తున్నారు. ఇందులో శిక్షణ పొందిన యువతకు పలు సంస్థల నుంచి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ మేరకు విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో స్వల్పకాలిక కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి పతాకమూరు శ్రీనివాసరావు, ప్రాంత కార్యదర్శి సీతారాములు, అపెక్స్ ఇండియా సంస్థ ప్రతినిధులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు ఓయూ డాక్టరేట్



మణికొండ, అక్టోబర్ 10 : గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల(సీబీఐటీ)లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న స్పందనకు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందు కున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో ఏవిధంగా ఉపయోగపడుతుంది అనే అంశంపై పరిశోధన చేశారు. మట్టిని విశ్లేషించడానికి అనేకమైన సహకార పద్ధతులు ఉన్నప్పటికీ, టెక్నాలజీ ఉపయోగించి తక్కువ సమయంలో మట్టిలోని పోషకాలను ఎలా కనుగొనవచ్చు, పోషకాల పరిమాణాన్ని బట్టి ఏ పంటను వెయ్యాలో వివరించారు. అంతేకాకుండా నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం న్యావనంది గ్రామ మట్టి నమూనాలను సేకరించి ఆ గ్రామంలో మట్టి పోషకాలు ఎలా ఉన్నాయో కనుగొన్నారు. చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేశ్ పబ్బోజు పర్యవేక్షణలో పరిశోధనలు జరిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు, సీఎస్ఈ విభాగధిపతి ప్రొ. రమణ దుగ్యాల, ఇతర అధ్యాపకులు స్పందనను అభినందించారు.

## ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన



ప్రదర్శనలోని చిత్రాన్ని తిలకిస్తున్న ప్రతినిధులు

కొండాపూర్, అక్టోబర్ 10 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం చిత్రకారిణి అంజనీరెడ్డి 'జోయస్ సర్వ్యూట్ ఆఫ్ లైఫ్' పేరిట సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత, కళాకారిణి అంజు పొద్దర్ ముఖ్య అతిథిగా హాజరై జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ప్రొఫెసర్ కవిత దర్యాణి రావుతో కలిసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను తిలకిస్తూ, వాటి వివరాలను చిత్రకారిణి అంజనీరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనలోని చిత్రాలు ఆకట్టుకుంటున్నాయని, అద్భుతంగా చిత్రాలను తీర్చిదిద్దిన చిత్రకారిణి అంజనీరెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ ప్రదర్శన ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్, క్యూరేటర్ రత్న రావు శేఖర్, ఏఆర్ ప్రతీక్ష ప్రశాంత్, ఏఆర్ పల్లవి అంచూరి, శ్రీలత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'ను పరిశీలించిన జడ్సీ, డీసీలు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 10: సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నలగండ్ల ప్రభుత్వ పాఠశాలలో వెస్ట్‌జోన్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్ రెడ్డిలు పరిశీలించారు. నలగండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల ప్రవేశపెట్టిన సీఎం అల్పాహార కార్యక్రమం వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న టిఫిన్‌ల నాణ్యతను పరిశీలించారు. టిఫిన్ రోజు సమయానికి వస్తుందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. శేరిలింగంపల్లి ఏఎంహెచ్ఓ డాక్టర్ నగేశ్‌తో పాటు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న వెస్ట్‌జోన్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి